# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

ఆదివారం 06 07 2025

సంపుటి 1 సంచిక 67

పేజీలు : 03

UDYAM / TS-09-0148996



విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఆసక్తి గల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము



జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్
ఆర్.సీ. ఇన్చార్జులు
మండల రిపోర్టర్లు
క్రైమ్ రిపోర్టర్లు

73375 46647




(మీ వివరాలను వాట్సప్లో పంపగలరు)




## ఆదిత్య ఫార్మసీ ఎండీ ఆత్మహత్య

ఆదిత్య ఫార్మసీ మేనేజింగ్ డైరెక్టర్ నరసింహమూర్తి రాజు ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయవాడలోని క్షత్రియ భవన్‌లో ఆయన మరణించినట్లు గుర్తించారు. గత సంవత్సరం జరిగిన ఒక స్నేహితుడి హత్య కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు.ఈ నేపథ్యంలో ఆయన ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపుతోంది.

దశ, విజయవాడ



## సీతక్కకు మావోయిస్టు పార్టీ మరో సంచలన లేఖ

మంత్రి సీతక్క కు వార్నింగ్ ఇస్తూ వారం క్రితం మావోయిస్టులు విడుదల చేసిన లేఖ విపరీతంగా వైరల్ అయిన సంగతి తెలిసిందే. అయితే, ఈ లేఖలోని అంశాలపై ప్రస్తుతం విశ్లేషకులు పలు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. తాజాగా, మావోయిస్టు పార్టీ ఆ లేఖ మేం రాయలేదంటూ మరో సంచలన లేఖ విడుదల చేయడమే కారణం.

దశ, వరంగల్




## దేశ రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలి

దేశ రక్షణ కోసం ఐక్యంగా కార్మికులు కర్షకులు ఉద్యమించాలని ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వంపై పోరాటం సాగించాలని ఇందులో భాగంగా ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో రైతులు వ్యవసాయ కార్మికులు ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు.

వివరాలు 2లో



## జాగ్రత్తలతో బొగ్గు ఉత్పత్తి సాగించాలి

వర్షాకాలంలో కూడా ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి కుంటు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జులై నెలకు నిర్దేశించిన లక్ష్యాల సాధనకు రోజుకు 2.15 లక్షల టన్నుల బొగ్గు రవాణా, 1.80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలని సీఎండీ బలరామ్ కోరారు. తొలి త్రైమాసికంలో బొగ్గు ఉత్పత్తిలో 99 శాతం లక్ష్యాలను సాధించడంపై హర్షం ప్రకటించారు.

వివరాలు 3లో




# పొలిటికల్ సర్వే ప్రకంపనలు

ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో న్నికలు జరిగితే బీఆర్ఎస్ దే విజయం

గులాబీ దళానికి 62 సీట్లు వచ్చే చాన్స్

అధికార కాంగ్రెస్ కి షాకివ్వనున్న ప్రజలు.. 40 సీట్లకే హస్తం పార్టీ పరిమితమయ్యే చాన్స్

కాస్త పుంజుకోనున్న బీజేపీ.. 8 సీట్ల నుంచి 11 సీట్లకు పెరగనున్న బలం

పాతబస్తీలో 2 సీట్లు కోల్పోనున్న మజ్లిస్.. 7 నుంచి 5కి సీట్లు

## తెలంగాణ అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ సర్వేలో సంచలన అంశాలు

**తెలంగాణలో తాజాగా జరిగిన ఒక పొలిటికల్ సర్వే కలకలం సృష్టిస్తోంది. వరుసగా రెండోసారి అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్న అధికార కాంగ్రెస్ పార్టీకి షాకిచ్చేలా సర్వే ఫలితాలు ఉన్నాయి. అదే సమయంలో ఇంటాబయటా సమస్యలతో సతమతమవుతున్న ప్రతిపక్ష బీఆర్ఎస్ లో నూతనోత్తేజం నింపేలా తాజా సర్వే రిజల్ట్ వచ్చాయి. మరోవైపు ఈసారైనా అధికారంలోకి రావాలని భావిస్తున్న బీజేపీ ఆశలపై సర్వే నీళ్లుజల్లింది. కమలదళం సీట్లలో స్వల్ప పెరుగుదల మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని సర్వే సంస్థ అభిప్రాయపడింది. కాగా, దశాబ్దాలుగా పాతబస్తీని కంచుకోటగా మార్చుకున్న మజ్లిస్ పార్టీకి సీట్ల కోత తప్పదని సర్వే అంచనా వేసింది. సీపీఐకి ఉన్న ఒక్క సీటు కూడా ఈసారి పోతుందని పేర్కొంది.**

..: దశ, హైదరాబాద్ :..

### ప్రజానాడి ఇలా..

తెలంగాణ అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ అనే సంస్థ జూన్ 1 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 119 నియోజకవర్గాల్లోనూ పొలిటికల్ సర్వే నిర్వహించింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎవరికి ఓటు వేస్తారో చెప్పాలని ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులే 2028 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయా పార్టీల నుంచి తిరిగి పోటీ చేస్తే కాంగ్రెస్ ఓటమి పాలవనుండగా బీఆర్ఎస్ సాధారణ మెజారిటీతో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని సర్వే సంస్థ అంచనా వేసింది. మొత్తంగా బీఆర్ఎస్ 62 సీట్లలో గెలిచే అవకాశం ఉందని సంస్థ అంచనా వేసింది. అదే సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీ 40 సీట్లకే పరిమితమయ్యే అవకాశం కనిపిస్తోందని పేర్కొంది. అలాగే బీజేపీ 11 సీట్లలో గెలవచ్చొని, ఎంఐఎం 5 సీట్లలో విజయం సాధించగలదని తెలిపింది. ఇతరులు ఒక స్థానంలో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. అయితే తమ అంచనాలు 3 శాతం మేర అటుఇటుగా ఉండే అవకాశం ఉందని తెలంగాణ అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ తెలిపింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 65 సీట్లు లభించగా, బీఆర్ఎస్ 38, బీజేపీ 8, ఎంఐఎం 7, ఇతరులు ఒక స్థానంలో గెలిచిన విషయం తెలిసిందే.

### ఉమ్మడి జిల్లాలవారీగా చూస్తే..

తాజా సర్వే ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 సీట్లకుగాను 5 సీట్లలో బీఆర్ఎస్, 3 చోట్ల బీజేపీ, 2 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మొత్తం 9 సీట్లలో బీఆర్ఎస్ 5, కాంగ్రెస్ 2, బీజేపీ 2 గెలుచుకోవచ్చని

..మిగతా 2వ పేజీలో →



## కె.సి.ఆర్ ని కలసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి , ఏం.ఎల్.సి నవీన్ రెడ్డి,మాజీ ఎం.ఎల్.ఏలు రావుల.చంద్రశేఖర్ రెడ్డి,జైపాల్ యాదవ్,గువ్వల.బాలరాజు ఈరోజు నందినగర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు కె.సి.ఆర్ ఆరోగ్య, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కె.సి.ఆర్ పార్టీ నిర్మాణం,రాష్ట వ్యాప్తంగా ప్రజల సమస్యలు,జిల్లాలో పార్టీ బలోపేతం గురించి చర్చించి పలు సూచనలు చేశారు.

దశ, హైద్రాబాద్

## రేవంత్.. దమ్ముంటే రాజీనామా చేసి.. బీసీని సీఎం చేయండి

నేను అద్యక్షపదవికి రాజీనామా చేసి బిసి ని అధ్యక్షున్ని చేస్తా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు

సమర భేరి సభలో మోదీ,బిజెపి, ఆర్ఎస్ఎస్‌ను విమర్శించడమే తప్పు.. మాట్లాడింది ఏమిలేదు.. కేంద్ర ప్రభుత్వ నిధులపై చర్చకు సిద్ధమా..?



**దశ, హైదరాబాద్:** మామూలు కార్యకర్తగా పార్టీలో పనిచేస్తూ, సైకిళ్లపై తిరుగుతూ పోస్టర్లు అంటించడం, బ్యానర్లు వేయడం, బూత్ ఏజెంట్‌గా పార్టీ కోసం నిబద్ధతతో పనిచేయడం ద్వారా నా రాజకీయ ప్రయాణం బిజెపిలో ప్రారంభమైందన్నారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రాంచందర్ రావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. విద్యార్థి పరిషత్‌లో ఉన్న సమయంలో ప్రారంభించిన ఉద్యమ స్వభావం, బిజెపిలో కొనసాగించాను.దేశంలో సొంత మెజార్టీతో బిజెపి ప్రభుత్వం 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. మరికొన్ని రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి ద్వారా అధికారంలో ఉంది.ఇటువంటి బలమైన పార్టీలో సాధారణ కార్యకర్తగా ఉన్న నాకు, పార్టీ అధిష్టానం

..మిగతా 2వ పేజీలో →

## తేల్చుకుందాం రా..

సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

రైతు సంక్షేమం గురించి చర్చించేందుకు తెలంగాణలో ఎక్కడైనా చర్చకు సిద్ధమే..




**దశ, హైదరాబాద్:** రైతు సంక్షేమం గురించి చర్చించేందుకు తెలంగాణలో ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 72 గంటల్లో రా.. తేల్చుకుందామని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో చర్చకు సిద్ధమని చెప్పారు. చర్చకు మూడు రోజుల సమయం ఇస్తున్నామని, ప్రిపేర్ అయ్యి రావాలన్నారు. లేదంటే చర్చకు వచ్చి బేసిన్లు, బెండకాయలు అంటే ఇజ్జత్ పోతుందని ఎద్దేవా చేశారు. పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణలో రైతు రాజ్యం తెచ్చింది కేసీఆర్. రైతు కేంద్రంగా ప్రభుత్వాన్ని నడిపింది బీఆర్ఎస్. నిజం తెలిసినా ఒప్పుకోలేని వ్యక్తి రేవంత్ రెడ్డి. సభ పెడితే బూతులు మాట్లాడుడే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నాడు. రైతు సంక్షేమంపై రేవంత్ రెడ్డి ఎక్కడ చర్చ పెట్టినా మేం రెడీ. 72 గంటలు సమయం ఇస్తున్నా.. ప్రిపేర్ అయ్యి చర్చకు రండి. రేవంత్ రెడ్డికి బేసిన్ తెలవదు, బెండకాయ తెల్వదు. దేవాదుల గోదావరి బేసిన్‌లో ఉందా అని అడుగుతడు. నల్లమల పులి అంటాడు.. మళ్లీ నల్లమల తెలంగాణలోనే ఉందా అని అంటడు.నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ ఉద్యమాన్ని నడిపాం. 75 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత వ్యవసాయ రంగానికి కేసీఆర్

..మిగతా 2వ పేజీలో →

# తెలంగాణలో 13 పార్టీలకు నోటీసులు

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. గత ఆరు సంవత్సరాలుగా ఎటువంటి ఎన్నికల్లోనూ పోటీ చేయని రాజకీయ పార్టీలకు తమ గుర్తింపును కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ మేరకు రాష్ట్రంలోని 13 రాజకీయ పార్టీలకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. తమ పార్టీల పేరును రిజిస్టర్డ్ జాబితా నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని ఈ నోటీసుల్లో ఈసీ పేర్కొంది. ఈ చర్యలు తీసుకునేందుకు గాను ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. పార్టీల పేరుతో దినపత్రికల్లో ప్రకటనలు, సోషల్ మీడియాల్లో ప్రచారం చేయడంతో పాటు.. ఆయా పార్టీలను జాబితా నుంచి తొలగించాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన ప్రతిపాదనలను ఈ నెల 10వ తేదీలోపు సమర్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారుల నుంచి అందే నివేదికను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పంపనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా రాజకీయ పార్టీల వ్యవస్థలో జవాబుదారీతనం పెంచాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. గతంలో కూడా కేంద్ర ఎన్నికల సంఘం ఇలాంటి చర్యలు తీసుకుంది.నోటీసులు అందుకున్న పార్టీల్లో హన్మకొండ జిల్లాకు చెందిన తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ, హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ మైనారిటీస్ పొలిటికల్ పార్టీ, జాగో పార్టీ, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్, తెలంగాణ లోక్ సత్తా పార్టీ, తెలంగాణ మైనారిటీస్ ఓబీసీ రాజ్యం, యువ పార్టీ ఉన్నాయి. అలాగే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (అంబేద్కర్ ఫూలే), తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ కూడా ఈ జాబితాలో ఉన్నాయి.రంగారెడ్డి జిల్లాకు చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య సమితి పార్టీ, జాతీయ మహిళా పార్టీ, యువ తెలంగాణ పార్టీ, చివరగా వరంగల్‌కు చెందిన తెలంగాణ ప్రజా సమితి (కిషోర్, రావు, కిషన్) కూడా నోటీసులు అందుకున్నాయి. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చిన్న పార్టీల భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.




## బాలలపై లైంగిక దాడులను అరికట్టాలి

బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడానికి అత్యంత ప్రాధాన్యత: సీఎం రేవంత్

2

# దశ

నిజం.. నిర్భయంగా..




# నేడు అంతర్జాతీయ ముద్దు దినోత్సవం


దశ, హైద్రాబాద్: అంతర్జాతీయ ముద్దు దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై 6న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. పంతొమ్మిదవ శతాబ్దంలో, ముద్దు రోజు గ్రేట్ బ్రిటన్లో కనుగొనబడింది, కానీ రెండు దశాబ్దాల క్రితం ఈ సెలవుదినం ఐక్యరాజ్యసమితి ఆమోదించింది. ఈ రోజున, భూమిలోని ప్రతి నివాసి ముద్దులో అన్ని వెచ్చని భావాలను వ్యక్తపరచగలడు. ముద్దు అనేది ఒక ఆనందకరమైన అనుభవమని, సాన్నిహిత్యాన్ని వ్యక్తీకరణ చేస్తుందని తెలియజేయడంకోసం ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది. ముద్దు అనేది మానవ ఎమోషన్. ఎదుటివారిపై తమను ఉన్న ప్రేమను వ్యక్తం చేయటానికి ముద్దు పెడుతుంటారు. భార్యాభర్తలు, ప్రేమికులు, స్నేహితుల మధ్య అనోత్యను పెంచేందుకు ముద్దు ఒక అద్భుతమైన సాధనం. ముద్దు పెట్టుకోవడం మానవ బంధాలను మరింత బలపరచేందుకు ముద్దు ఎంతగానో ఉపయోగపడుతుంది.



# పొలిటికల్ సర్వే...

**మొదటి పేజీ తరువాయి**


సర్వే అంచనా వేసింది. ఇక ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 సీట్లకుగాను 7 చోట్ల బీఆర్ఎస్, 4 సీట్లలో కాంగ్రెస్, 2 సీట్లలో బీజేపీకి విజయావకాశాలు ఉన్నట్లు సర్వే సంస్థ పేర్కొంది. ఉమ్మడి మెదక్ లో మొత్తం 10 సీట్లు ఉండగా 7 సీట్లలో బీఆర్ఎస్ గెలవచ్చని సంస్థ అభిప్రాయపడింది. కాంగ్రెస్ పార్టీ 3 స్థానాల్లోనే గెలిచే అవకాశం ఉందని తెలిపింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 14 సీట్లకుగాను 11 సీట్లను బీఆర్ ఎస్ చేజిక్కించుకుంటుందని సర్వే ఫలితాలు చెబుతున్నాయి. అక్కడ కాంగ్రెస్ పార్టీకి 2 సీట్లు మాత్రమే రావొచ్చని, ఇతరులు ఒక స్థానంలో గెలవొచ్చని సర్వే ఫలితాలు వచ్చాయి. హైదరాబాద్ జిల్లాలోని 15 సీట్లకుగాను 6 సీట్లను బీఆర్ఎస్ గెలుచుకుంటే ఎంఐఎం 5, బీజేపీ 2 చోట్ల, కాంగ్రెస్ ఒక సీట్లో, ఇతరులు ఒక స్థానంలో గెలవనున్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 8 సీట్లలో గెలిస్తే బీఆర్ఎస్ 5 చోట్ల, బీజేపీ ఒక సీట్లో గెలిచే అవకాశం ఉందని సర్వే సంస్థ తెలిపింది. ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 సీట్లకుగాను బీఆర్ఎస్, కాంగ్రెస్ చెరో 6 సీట్లలో గెలవొచ్చని పేర్కొంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సీట్లలో బీఆర్ ఎస్ 7 చోట్ల, కాంగ్రెస్ 5 సీట్లలో గెలుస్తాయని అంచనా వేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ 7 చోట్ల, బీఆర్ఎస్ 3 సీట్లలో గెలిచే అవకాశం ఉందని సర్వే సంస్థ తెలిపింది. మొత్తంగా చూస్తే మహబూబ్ నగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో మాత్రమే బీఆర్ఎస్ కన్నా కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తాయని ఉమ్మడి నల్లగొండ ఇరు పార్టీలు సమాన స్థాయిలో సీట్లు గెలిచే అవకాశం ఉందని తెలంగాణ అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ అంచనా వేసింది.




## ప్రజల్లోకి వెళ్లలేకపోతున్న

# కాంగ్రెస్ పథకాలు..

ఏడాదిన్నర క్రితం మొదలైన రేవంత్ రెడ్డి సర్కారు కొన్ని పథకాలు, అభివృద్ధి పనులు చేస్తున్న కూడా ప్రజల్లోకి వెళ్లడం లేదని తెలుస్తోంది. గత ప్రభుత్వాలు చేసిన తప్పలను చూపిస్తూ రేవంత్ రెడ్డి పాలలూ బహిరంగ సభల్లో ప్రజలోకి వెళ్లే ప్రయత్నం చేశారు. రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అంతగా శ్రద్ధ చూపడం లేదన్నట్టు అనిపిస్తోంది. చేసిన పని కూడా చెప్పకోలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉండడంతో ఇదే ఆదునుగ భావిస్తున్న ప్రతిపక్ష పార్టీలు తాము చేసిన గొప్పలను చెప్పకుంటూ ప్రభుత్వాన్ని ఎండబెడుతున్నారు. చేసిన పనులను సైతం చెప్పకోలేని పరిస్థితిలో ఉన్న కాంగ్రెస్ ఇదే విధంగా ఉంటే రానున్న రోజుల్లో గ డ్డు పరిస్థితులు తప్పేలా లేవు. ఇంకో మూడున్నర ఏళ్ల పాటు ఉండే ప్రభుత్వం ప్రజలకు వెళ్లేందుకు చేస్తున్న పథకాలను సైతం చెప్పకపోతే ఆ పరిస్థితి తప్పదు. ఇప్పటికైనా కాంగ్రెస్ మేల్కొని పథకాలన్నీ ప్రజల్లోకి వెళితే తప్ప వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్కు ప్రజలు పట్టం కట్టకపోవచ్చు అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రులు ఎమ్మెల్యేలు కార్యకర్తలు ప్రభుత్వ చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ఎంతైనా ఉంద ని స్పష్టంగా అర్థం అవుతుంది.




# రేవంత్.. దమ్ముంటే... రాజీనామా చేసి..

**మొదటి పేజీ తరువాయి**

నమ్మకంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతను అప్పజెప్పడం, నేను పనిచేసిన కృషికి గుర్తింపుగా భావిస్తున్నాను.

### కాంగ్రెస్ హామీలు ఎలా ఇచ్చింది

ఇది ప్రజలను మోసం చేసే ఆలోచనే. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ఇవాటిలో ఏవీ అమలు చేయలేదు. రైతుల రుణ మాఫీను పూర్తిగా చేయకుండా మధ్యలో నిలిపివేశారు. రైతు భరోసా పేరుతో రూ. 15 వేలు ఇస్తామని చెప్పి రూ. 12 వేలకు తగ్గించారు. ఇప్పటివరకు రెండు దఫాలు మోసం చేశారు. మళ్లీ సర్పంచ్ ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా రూ. 6 వేలు చొప్పున మాత్రమే రైతు భరోసా ఇచ్చి చేతులు దులుపుకున్నారు.రైతులను మోసం చేస్తే, దగా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు.

### సామాజికంగా వెనుకబడిన వర్గాల గురించి మాట్లాడలేదు

సామాజిక న్యాయ సమర భేరి సభలో మోదీ , బిజెపి, ఆర్ఎస్ఎస్ను విమర్శించడమే తప్ప సామాజికంగా వెనుకబడిన వర్గాల గురించి కనీసం మాట్లాడలేదు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రజల గురించి ఒక్కసారి కూడా ఆలోచించలేదు.కాంగ్రెస్ అవినీతి పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుతూ వరుసగా మూడు సార్లు కాంగ్రెస్ పార్టీని ఓడించారు.బిజెపి ప్రజల కోసం పనిచేసే పార్టీ, కాంగ్రెస్ అధికారం కోసం, అవినీతి కోసం పనిచేసే పార్టీ.AICC అంటే ఆల్ ఇండియా చీటింగ్ కమిటీ అన్నట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నిన్నటి సభలో భవిష్యత్తులో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 ఎమ్మెల్యేలు, 15 ఎంపీ సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారు. బహుశా ఆ కాంగ్రెస్ నాయకులు టంగ్ స్లిప్ అయి మాట్లాడినట్లున్నారు. 100 మంది ఎమ్మెల్యేలు, 15 ఎంపీ సీట్లు బిజెపి గెలుస్తుందని చెప్పబోయి పొరపాటుగా కాంగ్రెస్ గెలుస్తుందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ల నుంచి జడ్పీటీసీల వరకు అన్ని సీట్లలో బిజెపి పోటీ చేస్తుంది. అత్యధిక స్థానాల్లో గెలుస్తుంది. హర్యానా, త్రిపుర వంటి రాష్ట్రాల్లో ప్రజలు బిజెపిని గెలిపించినట్లుగా తెలంగాణలోనూ గెలిపిస్తారు.

42 శాతం రిజర్వేషన్ల విషయంలో తీసుకొచ్చిన బీసీ బిల్లుకు బిజెపి మద్దతు ఇచ్చింది. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే నన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయే సమయానికి రాష్ట్రంలో లక్షా 30 వేల ఉద్యోగ ఖాళీలు ఉండేవి. మరి ఆ ఖాళీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు భర్తీ చేయలేదు..?తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ. 12 లక్షల కోట్ల నిధులు ఇచ్చింది. దీనిపై కాంగ్రెస్ చర్చకు సిద్ధమా..? అని ప్రశ్నించారు.

# బాలలపై లైంగిక దాడులను అరికట్టాలి: సీఎం రేవంత్

**దశ, హైదరాబాద్:** సోషల్ మీడియాలో ద్వారా బాలలపై జరుగుతున్న లైంగిక దాడుల విషయంలో ఎలాంటి జాలి చూపకుండా దోషుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో "నిస్సహాయకులకు అండగా లైంగిక దాడికి గురైన పిల్లల రక్షణ మరియు హక్కులు" అన్న అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ... "పిల్లలపై జరుగుతున్న హేయమైన నేరాలను నియంత్రించడమే కాకుండా బాధితులకు చట్టపరంగా,



నైతిక పరంగా మాత్రమే కాకుండా అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. వారి రక్షణ కోసం తెలంగాణలో భరోసా ప్రాజెక్టును చేపట్టాం. భరోసా ప్రాజెక్టు కింద ప్రస్తుతం 29 కేంద్రాలు పనిచేస్తున్నాయని అన్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఉంది. ఈ కోర్టుల ద్వారా కేసులను సత్వరం పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం కల్పించడం, భవిష్యత్తులో వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్న లక్ష్యంతో వీటిని ప్రారంభించాం. పోక్సో చట్టం, , జువెనైల్ చట్టాల ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించాలి. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి వేదన కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలి. న్యాయం కేవలం కోర్టుల్లోనే లభించాలనే కాకుండా, ఈ ప్రక్రియలో ప్రతి దశలోనూ వారికి అవసరమైన అండదండలు లభించాలి. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో పాటు అన్ని దశల్లోనూ బాధితులకు న్యాయం దక్కాలి, రక్షణ కల్పించాలని అయన అన్నారు. ఈ సదస్సులో యునిసెఫ్ ప్రతినిధి సింథియా మెకాఫ్రే, డీజీపీ జితేందర్, , తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారులు, పోలీసు అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో పాటు పౌర సమాజంలోని భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు హాజరయ్యారు.

# 'బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి '



**దశ, ఎల్బీనగర్ :** జూలై 9న నిర్వహిస్తున్న సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ పిలుపునిచ్చారు. ఆటోనగర్ లోని టీసీఐ ఫైట్ ఇండియా లిమిటెడ్ గ్రేట్ మీటింగ్ లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి, చంద్రమోహన్ మాట్లాడుతూ... అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దుచేసి, కార్మికులను యాజమాన్యాలకు బానిసలను చేస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు ఈ నెల 9న సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కనీస వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ అప్రెంటిస్లు, ట్రైనీలు తదితర కేటగిరీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస పెన్షన్ రూ, 9 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.




# పోటీ పరీక్షల్లో నాగోల్ విద్యార్థినికి జాతీయ పురస్కారం

దశ , ఎల్బీనగర్ : ప్రతి ఏడాది ప్రముఖ విద్యా సంస్థ సీమ్స్ ఒలంపియాడ్ నిర్వహించే జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో నాగోల్ లోని సెయింట్ జాన్స్ పాఠశాలకు చెందిన 8వ తరగతి (గత అకాడమిక్ ఇయర్ ) విద్యార్థిని దండెంపెల్లి భూమిక మడో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం శనివారం విద్యార్థినితోపాటు తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూరం రామ్ రెడ్డి జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ ను కనపరిచి మూడో స్థానాన్ని కైవసం చేసుకున్న భూమికని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమతారెడ్డి, ఉపాధ్యాయులు తదితరు పాల్గొన్నారు

# తేల్చుకుందాం రా..

**మొదటి పేజీ తరువాయి**

చేసినంత ఎవరూ చేయలేదు. ఎరువుల పంపిణీ చేతకాని మీరు.. కేసీఆర్ను చర్చకు పిలుస్తారా?.యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎరువులు, విత్తనాల కోసం లైన్లలో చెప్పులు పెట్టడమేనా ఇందిరమ్మ రాజ్యం అంటే. ఆసిఫాబాద్ జిల్లాలో రైతులు ఎరువల కోసం యుద్ధాలు చేస్తున్నారు.ఆధార్ కార్డు చూపిస్తే రైతుకు ఒక బస్తా యూరియా ఇవ్వాలని ఆదేశించారు. రైతుల ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్గా మార్చింది రేవంత్ రెడ్డి కాదా. వరంగల్ రైతు డిక్లరేషన్లో ఒక్కడైనా అమలు చేశారా. ఒకేసారి రుణమాఫీ చేస్తామని చెప్పారు.. చేశారా?. రేవంత్ రెడ్డి ఎక్కడ చర్చకు రావాలో ప్లేస్, డేట్ చెప్పు.. నువ్వు పారిపోతే మేం టైమ్, ప్లేస్ చెబుతున్నాం.. చర్చకు రా. సోమాజిగూడ ప్రెస్క్లబ్లో 8 తారీఖునాడు చర్చకు సిద్ధం. ఉదయం 11 గంటలకు సమయం ఇస్తున్నాం. వస్తవా.. పారిపోతావో నువ్వే తేల్చుకో. అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్, రేవంత్ రెడ్డి చర్చకు రావాలి. రూ.2500 కోసం కోటీ 40 లక్షల మంది మహిళలు ఎదురు చూస్తున్నారు. స్కూటీల కోసం విద్యార్థినిలు ఎదురు చూస్తున్నరు. రేవంత్ రెడ్డి తెలంగాణను పే సీఎం.. పే ఢిల్లీ ఏటీఎంగా మార్చిండు' అని కేటీఆర్ అన్నారు.

## అంతరాష్ట్ర గంజాయి ముఠా గుట్టు రట్టు

**దశ , సికింద్రాబాద్:** సికింద్రాబద్ రైల్వే పోలీసులు అంతరాష్ట్ర గంజాయి ముఠా గుట్టు రట్టు చేసారు. ముగ్గురు మహిళలతో పాటు ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వారి నుండి ₹ 22.93లక్షల విలువైన 46కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులు మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ముఠా పట్టుబడింది.

## దేవాలయ భూమికి నష్టపరిహారం చెల్లించాలి

**- జీహెచ్ఎంసీ కమిషనర్ ను కోరిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కమిటీ**

**దశ, ఎల్బీనగర్:** ఫ్లైఓవర్ నిర్మాణంలో జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకున్న ఆలయ భూమికి నష్టపరిహారం చెల్లించాలని ఎల్బీనగర్ లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమిటీ, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్నన్ ను శనివారం కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి, ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానం కార్యనిర్వాహక అధికారి ప్రేమ్ కుమార్, శేఖర్ పంతులు, స్థానిక నాయకుడు శ్రీధర్ గౌడ్ తదితరులు కలిసి నష్టపరిహారం చెల్లించాలని వినతి పత్రం అందజేశారు. ఎల్బీనగర్ లోని మాల్ మైసమ్మ ఫ్లైఓవర్ నిర్మాణానికి సర్వే నంబర్ 49/13లో ఉన్న 1232 చదరపు గజాల భూమి, దేవస్థాన నిర్మాణాలను జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకుంది. ఫ్లైఓవర్ వినియోగంలోకి వచ్చినప్పటికీ, ఈ భూమికి సంబంధించిన నష్టపరిహారం కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉంది. దేవాలయాభివృద్ధి, నిర్వహణ కోసం అధికారులు స్పందించి, తక్షణమే నష్టపరిహారాన్ని విడుదల చేయాలి జీహెచ్ఎంసీ కమిషనర్ ను కోరారు.

దశ
నిజం.. నిర్భయంగా..

03
ఆదివారం
6-7-2025
WWW.
DASHANEWS
.COM



## చరిత్రలో ఈ రోజు

1901 : జనసంఘ్ పార్టీ సంస్థాపక అధ్యక్షుడు, కోల్‌కతా విశ్వవిద్యాలయం మాజీ కులపతి, మాజీ కేంద్ర మంత్రి శ్యాంప్రసాద్ ముఖర్జీ జననం (మ.1953).
1930 : కర్ణాటక సంగీత విద్వాంసుడు, కవి, వాగ్గేయకారుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ జననం (మ.2016). (చిత్రంలో)
1935 : టిబెట్ దేశీయుల మతగురువు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, 14వ దలైలామా జన్మించాడు.
1946 : అమెరికన్ నటుడు, చిత్ర నిర్మాత, రచయిత, సినిమా దర్శకుడు సిల్వెస్టర్ స్టాలోన్ జననం.
1986 : భారత స్వాతంత్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త, దేశానికి ఉపప్రధానిగా పనిచేసిన జగ్జీవన్ రాం మరణం (జ.1908).
1885 : లూయీ పాశ్చర్ తయారు చేసిన యాంటీ రేబీస్ వాక్సిన్ ని మొట్టమొదటి సారిగా వాడారు.
| నేడు ప్రపంచ జంతుకారక వ్యాధి దినోత్సవం | ప్రపంచ రేబిస్ దినోత్సవం

# వర్షాకాలపు జాగ్రత్తలతో బొగ్గు ఉత్పత్తి సాగించాలి

- భూగర్భ గనులలో ఉత్పత్తిని గణనీయంగా పెంచాలి
- ఏరియా జీఎంలకు సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశం




**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బొగ్గు రవాణాలో 100 శాతం బొగ్గు ఉత్పత్తిలో 99 శాతం లక్ష్యాలను సాధించడంపై సీఎండీ ఎన్.బలరామ్ హర్షం ప్రకటించారు. ఏప్రిల్ నుండి జూన్ నెల వరకు బొగ్గు రవాణా లక్ష్యం 160 లక్షల టన్నులు కాగా 103 శాతంతో కంపెనీ 166 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసింది. అలాగే బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 160 లక్షల టన్నులు కాగా 99 శాతంతో కంపెనీ 159.9 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి సాధించింది. శనివారం హైదరాబాద్ లోని సింగరేణి భవన్ నుంచి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ సంస్థ డైరెక్టర్లతో అన్ని ఏరియాల్లోని జీఎంలతో త్రైమాసిక ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కూడా ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి కుంటు పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జులై నెలకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించడం కోసం రోజుకు 2.15 లక్షల టన్నుల బొగ్గు రవాణా, 1.80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఏరియా ప్రగతిపై సంబంధిత ఏరియా జీఎంతో సమీక్షించారు. ఉత్పత్తికి అవరోధంగా ఉన్న అంశాల పైన ఆయన అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. కాగా కొత్తగూడెంలో అన్ని అనుమతులు మంజూరైన వీకే ఓపెన్ కాస్ట్ గని భూమి పూజ కార్యక్రమాన్ని ఈ నెలాఖరులో నిర్వహించాలని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇల్లందు జేకే కోల్ మైన్, గోలేటి కోల్ మైన్ కు సంబంధించిన పర్యావరణ అటవీ శాఖ అనుమతులకు సంబంధించి ప్రయత్నాలు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన బొగ్గు నాణ్యతా ప్రమాణాల పెంపుదలకు తీసుకుంటున్న చర్యలపై నిశితంగా చర్చించారు. వినియోగదారులకు ఇస్తామన్న గ్రేడ్ బొగ్గును సరఫరా చేయడానికి ప్రతీ ఏరియాలో సిహెచ్ పి లలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే రక్షణకు సంబంధించి ప్రతీ గనిలో రక్షణ ఆడిట్లను నిర్వహించాలని రక్షణ లోపాలు లేకుండా సవరించాలని ఆయన సేఫ్టీ విభాగం వారిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ లో ప్రారంభమైన బొగ్గు ఉత్పత్తి పై కూడా ఆయన సమీక్షించారు.

అక్కడ ఉత్పత్తి అవుతున్న బొగ్గును సమీపంలోని చండిపడా రైల్వే సైడింగ్ కు రవాణా చేయడానికి తగు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, ఎల్.వి సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, ఈడీ (కోల్ మూమెంట్)ఎస్.డి.ఎం సుభాని, అడ్వైజర్ (ఫారెస్ట్రీ)మోహన్ పరిగెన్, జీఎం(సి పి పి) ఏ.మనోహర్, కార్పోరేట్ జీఎంలు అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.






# దేశ రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలి

- కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వం
- 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో రైతులు, వ్యవసాయ కార్మికులు ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలి
- ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర బాధ్యులు తమ్మినేని వీరభద్రం

**దశ, భద్రాద్రి కొత్తగూడెం :** దేశ రక్షణ కోసం ఐక్యంగా కార్మికులు కర్షకులు ఉద్యమించాలని కార్ఫోరేట్ల ప్రయోజనాల కోసం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వంపై పోరాటం సాగించాలని ఇందులో భాగంగా ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో రైతులు వ్యవసాయ కార్మికులు ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర బాధ్యులు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. శనివారం మంచికంటి భవన్ లో సిఐటీయూ జిల్లా కార్యదర్శి ఎజె రమేష్ అధ్యక్షతన ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్ఫోరేట్లకు దేశ సంపదను కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని విమర్శించారు. దేశ వ్యాప్తంగా 44 కోట్లమంది కార్మికులు బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సార్వత్రిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ఒకవైపు అమ్ముకుంటూ రెండో వైపున వ్యవసాయ రంగంలోకి కూడా కార్పోరేట్ శక్తులను తీసుకురావడం కోసం మూడు నల్ల చట్టాలను మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. దేశాన్ని కాపాడేందుకు కార్మికులు కర్షకులు ఐక్యంగా సమ్మెజయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 9వ తేదీన మండల జిల్లా కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మదు, మాజీ డిసిసిబి చైర్మన్ యలమంచి రవికుమార్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యలమంచి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి, పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.పుల్లయ్య, నవ తెలంగాణ జిల్లా నాయకులు ఎంబి నర్సారెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.లక్ష్మి, ఎం.జ్యోతి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లిక్కి బాలరాజు, కాలంగి హరిక్రిష్ణ, ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ నబీ, పట్నం జిల్లా కన్వీనర్ కొండపల్లి శ్రీదర్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ భూక్యా రమేష్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు గౌరి నాగేశ్వరరావు, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కన్వీనర్ వాంకుడోత్ అమర్ సింగ్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లింగయ్య, సమ్మయ్య, నాయకులు ఈర్ల రమేష్, ముదిగొండ రాంబాబు, గడ్డం స్వామి, నిమ్మల వెంకన్న, బి.చిరంజీవి, కె.వెంకటేశ్వర్లు, గద్దల శ్రీనివాస్, పిట్టల అర్జున్, సత్రపల్లి సాంబశివరావు, యాసా నరేష్, మోరంపూడి శ్రీనివాసరావు, మర్మం చంద్రయ్య, సున్నం గంగ, బండారు శరత్ బాబు, బత్తుల వెంకటేశ్వర్లు, కొమరం కాంతారావు, తులసిరాం, ఈసం నరసింహారావు, ఆలేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద వైద్య విద్యార్థికి ఆర్థిక సహాయం



- ఫీజు కట్టి అండగా నిలిచిన అమృత హాస్పిటల్ డాక్టర్ బాబురావు
- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థి కుటుంబ సభ్యులు

**దశ భద్రాద్రి కొత్తగూడెం:** పేదల వైద్యునిగా... ఎంతో మంది అభాగ్యులకు ఉచితంగా వైద్య సదుపాయాలు సైతం అందించడంతో పాటుగా ఆపదలో ఉన్నారని ఎవరు తలుపుతట్టినా నేనున్నా అనే భరోసా ఇస్తూ.. తనవంతు చేయూత అందిస్తూ.. అందరిచేతా మనసున్న మహారాజుగా పేరున్న వైద్యులు అమృత మల్టీ స్పెషాలిటీ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ హాస్పటల్ డాక్టర్ బాబురావు. కరోనా లాంటి విపత్కర సమయంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వేలాది మందికి ప్రాణబిక్ష పెట్టిన ఆయన.. అమృత హాస్పటల్ ఆధ్వర్యంలో ఎన్నో మెడికల్ క్యాంపులు సైతం నిర్వహిస్తూ.. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నిరసించే ఆదివాసీలకు, గిరిజనులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని సైతం ఉచితంగా వారికి అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్థాకలితోనే వైద్య విద్యను అభ్యసిస్తూ.. ఒక్కపూట భోజనంతోనే సరిపెట్టుకుంటూ మిగతా రోజంతా పస్తులుంటూ ఎంబీబీఎస్ చదువుతున్న నిరుపేద విద్యార్థికి బాసటగా నిలిచారు డాక్టర్ బాబురావు. హాస్టల్ ఫీజు కట్టలేక ఒక్క పూట తిని రోజంతా కడుపుమాడ్చుకుంటున్న విద్యార్థికి రూ.27వేలు ఆర్థిక సాయం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే..

ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండల పరిధిలోని ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన నంద సాయి కిరణ్ వరంగల్‌లోకి కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సాయికిరణ్ తమ్ముడు సాయి కార్తీక్ గుజరాత్‌లోని ఎన్ఐటీ సూరత్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదువుతున్నాడు. సాయి కిరణ్ తల్లిదండ్రులు రోజూ కూలీకి వెళ్లనిదే పూటగడవని పరిస్థితి. దీంతో తన కుమారుడైన సాయికిరణ్‌ను మంచి స్థాయిలో చూడాలన్న కోరిక ఉన్నా.. అటు హాస్టల్‌కు ఇటు కాలేజీ ఫీజులు కట్టలేని పరిస్థితి. సాయి కిరణ్ 2022 ఫిబ్రవరి నుంచి డిసెంబర్ 2024 వరకు కళాశాల హాస్టల్ ఫీజు రూ.27000 చెల్లించాల్సి ఉంది. దీంతో ఒక పూట తింటూ మిగతా రోజంతా ఖాళీ కడుపుతోనే జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే యూనివర్శిటీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఈ ఫిజు చెల్లిస్తేనే హాల్‌టికెట్ పొందే అవకాశం ఉంది. ఈ విషయం తన స్నేహితుల ద్వారా తెలుసుకున్న అమృత మల్టీ స్పెషాలిటీ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ హాస్పటల్ అధినేత డాక్టర్ బాబురావు సాయికిరణ్ పరిస్థితి చూసి చలించిపోయారు. నేనున్నానంటూ.. నిరుపేద విద్యార్థికి భరోసానిస్తూ.. తనవంతుగా రూ.27,000 హాస్టల్ ఫీజు కట్టేందుకు ఆర్థిక సాయం అందజేశారు. కాగా డాక్టర్ బాబురావు చూపిన దాతృత్వానికి పలువురు ప్రముఖులు ప్రశంసలు అందించారు.



## సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల లను ఆకస్మికంగా తనిఖీ

**దశ, సూర్యాపేట :** విద్యార్థులకి మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తెలిపారు. శనివారం సూర్యాపేట మండలం బాలేంల లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్, ఇంటర్, డిగ్రీ కాలేజీలను జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ బియ్యం నాణ్యత పరిశీలించారు., అలాగే స్టాక్ వివరాలు, కూరగాయలు, వంట సామాగ్రి పరిశీలించారు. వంట గదుల నందు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అధిక కమిషన్లు వసూలు చేస్తే చర్యలు తప్పవు

- గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** రైతుల వద్ద అధిక కమిషన్లు వసూలు చేస్తే చర్యలు తప్పవని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం గడ్డి అన్నారం మార్కెట్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ కార్యాలయంలో కమిషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ పి. ప్రసాద్ రావులు హాజరయ్యారు. మార్కెట్ లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతరుల లైసెన్స్ పేరుతో నడుస్తున్న బినామీ ఏజెంట్లపై, కమిషన్ ఏజెంట్లు తీసుకోవాల్సిన బాధ్యతలపై చర్చించినట్లు తెలిపారు. మార్కెట్ బయట రైతుల ముసుగులో నడుస్తున్న దళారీ వ్యవస్థ పై కూడ చర్యలు తీసుకోనున్నట్లు సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. అనంతరం గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల వద్ద అధిక కమిషన్లు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్. భాస్కర చారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, డైరెక్టర్లు మచ్చేందర్ రెడ్డి, లక్ష్మి, గణేష్ నాయక్, గోవర్ధన్ రెడ్డి, అంజయ్య, ఇబ్రహీం, జైపాల్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, నవరాజ్, రఘుపతి రెడ్డి, మార్కెట్ కార్యదర్శి ఎండీ వహీద్, రాఘవేంద్ర, కమిషన్ ఏజెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిని"మా"దశ

## 'ఓ భామ అయ్యో రామ' ట్రైలర్ విడుదల

సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తుతున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రిలక్ రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను గమనిస్తే.. ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్, హీరో, హీరోయిన్స్ ఎనర్జీ, ఇలా ఈతరం ప్రేక్షకులతో పాటు అన్ని వర్గాల వారిని అలరించే ఫుల్ ప్యాకేజీగా ఈ చిత్రాన్ని రూపొందించారని అర్థమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ '' ట్రైలర్ విడుదలైన కొద్ది సమయంలోనే మంచి స్పందన వస్తోంది. ట్రైలర్ చూసిన వారు ఈచిత్రం షూర్ షాట్ విజయం అంటుంటే ఆనందంగా ఉంది. క్యూట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రత సన్నివేశం ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేస్తుంది. హీరో సుహాస్, మాళవిక మధ్య వచ్చే లవ్ సీన్స్ కూడా అలరించే విధంగా ఉంటాయి. సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. తప్పకుండా ఈ చిత్రం అందరికి కొత్త అనుభూతినిస్తుంది. జూలై 11న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. పూర్తి ఎంటర్‌టైనింగ్‌గా రాబోతున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మీ హృదయాలను దోచుకుంటుంది. తప్పకుండా నిర్మాతగా ఓ మంచి సినిమాను ఇవ్వబోతున్నాం అనే నమ్మకం ఉంది అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ప్రతి ప్రమోషన్ కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది.

